


RNI.NO.APTEL/2023/87681

# పబ్లిక్ రూల్

తెలుగు వార్తా దినపత్రిక



అనకాపల్లి | సంపుటి 02 | సంచిక 291 | 18 మార్చి 2025 | వెల -1 | పేజీలు -8

## అందులో ఒక శాతం నా భాగస్వామ్యం ఉన్నందుకు

# గర్విస్తున్నా

- కొనసాగుతున్న ఏపీ అసెంబ్లీ సమావేశాలు
- నేడు సభలో స్వర్ణాంధ్ర విజన్ పై లఘు చర్చ
- 10 సూత్రాల ఆధారంగా విజన్ అమలు చేస్తున్నామన్న చంద్రబాబు



స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ పై నేడు ఏపీ అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, 10 సూత్రాలు నిర్దేశించుకుని స్వర్ణాంధ్ర విజన్ వైపు అడుగులేస్తున్నామని చెప్పారు.

2 లో

## రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా ఇంటెల్ చీఫ్

# తులసీ గబ్బర్డ్ భేటీ



న్యూఢిల్లీ, (మార్చి 17) : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బర్డ్ సోమవారంనాడు సమావేశమయ్యిరు. ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య రక్షణ, భద్రతా సహకారం బలోపేతంపై చర్చిం చారు. ఒక రక్షణ ఒప్పందపైన కూడా చర్చలు జరిగినట్టు తెలు స్తోంది. తులసి గబ్బర్డ్‌తో సమావేశమైన విషయాన్ని సామాజిక మాధ్యం 'ఎక్స్'లో రాజ్‌నాథ్ సింగ్ షేర్ చేశారు. రక్షణ, సమాచార షేరింగ్‌తో పాటు, ఇండియా-యూఎస్ భాగ స్వా మ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు సమావేశంలో ఉభ యులూ చర్చించినట్టు చెప్పారు. ట్రంప్ రెండో విడత కార్యవర్గం లోని సీనియర్ స్థాయి అధికారి భారత్ పర్యటించడం ఇది మొదటి సారి. రెండున్నర రోజుల పర్య టనలో భాగంగా ఆదివారంనాడు న్యూఢిల్లీకి వచ్చిన ఆమె గ్లోబల్ ఇంటెలిజెన్స్ కాంక్లేవ్‌లూ కూడా

2 లో



# సహకార బ్యాంకుల్లో

## అవినీతిపై అచ్చెన్న సమాధానం ఇదీ..

అమరావతి, (మార్చి 17): సహకార బ్యాంకుల్లో అవకతవకలపై శాసనసభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ.. సుమారు 5వే లకోట్ల రూపాయలు మేర సహకార బ్యాంకుల్లో దోపిడీ జరిగిందని తెలిపారు. ఒక్క గుంటూరు జిల్లాలోనే రూ.600 కోట్ల రూపాయలు రైతుల కోసం పనిచేయాల్సిన బ్యాంకు ద్వారా దోచేశారన్నారు. ఆప్కాబ్, డీసీసీబీ నుంచి ఆర్గనైజ్డ్‌గా జరిగిన కుంభకోణం ఇది అని అన్నారు. పైనుంచి కింది దాకా అధికారంలో ఉన్న వాళ్ళ ఒత్తిడి, పర్యవేక్షణతోనే జరిగిందని తెలిపారు. రైతుల పేరున బోగస్ రుణాలు తీసుకున్నారని ఆరోపించారు. డీసీసీబీ స్థాయిలో త్రీ మ్యాన్ కమిటీ నియమించుకొని అయిదేళ్లలో కాంట్రాక్ట్ బేసిస్‌పై 50 మందిని నియమించుకున్నారని తెలిపారు. వాళ్లకు సంబంధించిన

2 లో

## జాబిల్లిపై త్వరలోనే

# అడుగుపెడతాం..

### చంద్రయాన్-5పై ఇస్రో కీలక అప్‌డేట్..



చంద్రునిపై ఇస్రో భవిష్యత్తులో చేపట్టబోయే పరిశోధనలపై ఇస్రో గుడ్ న్యూస్ ప్రకటించింది. చంద్రయాన్-4 లాంచింగ్ కాకముందే తర్వాత ప్రయోగం గురించి కీలక ప్రకటన వెలువరించింది. చంద్రునిపై అధ్యయనం చేయడానికి ప్రతిష్ఠాత్మకమైన చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఆమోదం తెలిపినట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు.

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిం చిన సందర్భంగా ఆయన గౌరవార్థం చెన్నైలో ఏర్పాటు చేసిన ఓ కార్య క్రమంలో మాట్లాడుతూ.. చంద్రయాన్ ప్రయోగాలపై కీలక వివరాలు తెలిపారు. చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఆమోదం తెలిపిం దని.. జపాన్ సహకారంతో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట చేపడు తున్నట్లు ప్రకటించారు.

చంద్రయాన్-5 మిషన్ స్పెషాలిటీ ఏంటంటే..

చంద్రయాన్-5 ఇదివరకటి మిషన్‌ల కంటే అత్యంత ప్రత్యేక మైందని ఇస్రో చీఫ్ నారాయణన్ తెలిపారు. చంద్రుని ఉపరితలాన్ని అధ్యయనం చేయడానికి 2023 లో ప్రయోగించిన చంద్రయాన్-3 25 కిలోల బరువున్న 'ప్రజ్ఞాన్' రోవర్‌ను మోసుకెళ్లగా.. చంద్రయాన్-5 ఏకంగా 250 కిలోల

2 లో



## వైసీపీ హయాంలో

# ఉపాధి హామీ పనుల్లో రూ. 250 కోట్ల అవినీతి

- ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు
- ఆ సమయంలో మాట్లాడిన డిప్యూటీ సీఎం
- మొత్తం రూ.250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు ఇచ్చిన నివేదికల ద్వారా వెల్లడైందన్న పవన్

2 లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

# కచ్చితంగా చెల్లిస్తాం

- విద్యారంగంపై చర్చ కావాలని అడిగి.. వైసీపీనే పాల్గొనలేదన్న మంత్రి
- వాస్తవాలు వినే పరిస్థితిలో వైసీపీ లేదని ధ్వజం
- ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై వైసీపీ ఆరోపణలకు మంత్రి లోకేశ్ కౌంటర్



ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై వాస్తవాలను వినే పరిస్థితిలో వైసీపీ లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థికసాయంపై మండలిలో వైసీపీ సభ్యుల

2 లో

# తప్పు మీది కాదు...

## ఈవీఎంలది

- కూటమి ప్రభుత్వంపై రోజా విమర్శలు
- రాష్ట్రంలో మెడికల్ కాలేజీలకు మంగళం పాడేశారని వెల్లడి
- స్కూళ్లను కూడా ఎత్తివేస్తున్నారంటూ విమర్శలు
- బాగుందయ్యా బాగుంది అంటూ వ్యంగ్యం

వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు.

రాష్ట్రంలో వైద్య కళాశాలలకు మంగళం పాడేశారని, రైతు భరోసా కేంద్రాలను కూడా ఎత్తివేస్తున్నా రని, ఇప్పుడు పాఠశాలల వంతు వచ్చిందని పేర్కొన్నారు. అయినా, విద్య

2 లో





# లోక్‌సభలో రైల్వే సమస్యలపై కీలక చర్చ..

ఢిల్లీ, (మార్చి 17) : ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో రైల్వే బడ్జెట్ కేటాయింపులు 2019-20లో రూ.68,000 కోట్ల నుంచి 2025-26 నాటికి రూ.2 లక్షల కోట్లకు పెరిగిందని తెలుగుదేశం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఇవాళ(సోమవారం) లోక్‌సభలో రైల్వేపై డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడారు. దీర్ఘకాలంగా

2 లో

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 283 కేసులు నమోదు చేసిన పోలీసు అధికారులు



## పట్టుబడిన మందుబాబులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు

విజయనగరం జిల్లా

విజయనగరం జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ గారు మార్చి 17న మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మార్చి 16న స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న 283మంది మందుబాబులపై కేసులు నమోదు చేసారు. వాహన తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు, సిబ్బంది రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలానాలను విధించారని జిల్లా ఎస్పీ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, పట్టుబడిన మందుబాబులకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని, ప్రజాశాంతికి భంగం కలిగించవద్దని సంబంధిత పోలీసు అధికారులు కౌన్సిలింగు నిర్వహించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# వైఎస్ఆర్ జిల్లా పేరు మారుస్తూ ఏపీ కేబినెట్ నిర్ణయం.

వైఎస్ఆర్ కడప జిల్లా

వైఎస్ఆర్ కడప జిల్లాగా మారుస్తూ నిర్ణయం.. గతంలో కడప




కేబినెట్‌లో వైఎస్ఆర్ పేరుకు అదనంగా కడప పేరును చేరుస్తూ నిర్ణయం.

# తప్పు మీది కాదు... ఈవీఎంలది

ప్రభుత్వ బాధ్యత కాదు అని మీరు ముందే చెప్పారు లెండి... తప్పు మీది కాదు, తప్పంతా ఈవీఎంలదే అని ఎద్దేవా చేశారు. "ఐదు కిలోమీటర్ల పరిధిలో గ్రామంలో ఒకే పాఠశాల ఉండాలా...? గ్రామంలో ఎన్ని బ్రాందీ షాపులైనా, ఎన్ని బెల్ట్ షాపులైనా ఉండొచ్చా...? బాగుందయ్యా బాగుంది అని ఊరంతా గుసగుసలాడుకుంటున్నారని తెలుస్తోంది" అంటూ రోజా సోషల్ మీడియాలో స్పందించారు.

# సహకార బ్యాంకుల్లో అవినీతిపై అచ్చెన్న సమాధానం ఇదీ..

వారు సెంట్రల్ బ్యాంకులో తిష్ట వేసి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై కొన్ని బ్రాంచ్‌లపై ఒత్తిడి చేశారన్నారు. రెవెన్యూ అధికారులు, డీసీసీబీ అధికారులు కొల్యూడ్ అయి వందల కోట్లు దోచేశారని మండిపడ్డారు. డ్వాక్రా సంఘాల పేరు మీద 3 మ్యాన్ కమిటీ మేనేజ్మెంట్‌లు ఒత్తిడి చేసి ప్రైవేటు బ్యాంకుల నుంచి సెంట్రల్ బ్యాంకులకే మార్చారన్నారు. రూ.200 కోట్లు ఈ విధంగా తినేశారని.... 2 కోట్ల రూపాయల కింద డ్వాక్రా సంఘాలకు లోన్ ఇచ్చి ప్రభుత్వం మారాక ఆయనే డబ్బులు కడుతున్నారన్నారు. పొన్నూరు బ్రాంచ్‌లో వడ్డీ మాఫీ కింద పడే డబ్బులను రెండు కోట్లు బదిలీ చేసుకొని ఇల్లు కట్టి ఇప్పుడు తిరిగి కడుతున్నారన్నారు. వారు ఇప్పటికీ అదే బ్యాంకుల్లో అధికారులుగా ఉన్నారన్నారు. గోడౌన్ల పేర్ల మీద ఆప్కాబ్ నుంచి పీఏసీఎస్ సొసైటీలపై ఒత్తిడి చేసి స్మశానాలలో కడుతున్నారని మండిపడ్డారు. లేఅవుట్ సైట్లలో, ట్యాంకు పోరంబోకులపై ఈ గోడౌన్లు కడుతున్నారన్నారు. ఋణం పీఏసీఎస్ సొసైటీ నుంచి తీసుకొని గోడౌన్లను ఎక్కడ బడితే అక్కడ కట్టారన్నారు. సొసైటీ స్థలం కాని దానిలో ఎలా గోడౌన్లు కడతారని ప్రశ్నించారు. గతంలో స్కూళ్ళ స్థలాల్లో సచివాలయాలు ఎలా కడతారని కూల్చమని హైకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. ఆప్కాబ్ ఎండీలు, డీసీసీబి ఛైర్మన్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. త్రీ మ్యాన్ కమిటీ వస్తే అడ్డగోలుగా దోచుకోమని చెప్పడం లేదు అనే విషయం గుర్తించాలన్నారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ రిపోర్టు ప్రకారం అమూల్ కోసం జగనన్న పాలవెల్లువ పేరు మీద రూ.11 కోట్లు ఋణాలు, జగనన్న తోడుకు రూ.20 కోట్లు, ఫిష్ ఆంధ్రాకు, వ్యవసాయ పర్మిట్‌లకు ఎలా ఋణాలు ఇచ్చారన్నారు. ప్రభుత్వం మారాక రెండు నెలల వరకూ ఎంక్వైరీ వేయలేదన్నారు. రైతులు సొమ్మును దోచుకొని దిగజారే పరిస్థితికి గత ప్రభుత్వం వచ్చిందని మండిపడ్డారు. రాష్ట్ర స్థాయిలో ఉన్నత సీనియర్ ఐఏఎస్ అధికారితో విచారణ చేయించాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర డిమాండ్ చేశారు.

అవినీతి వాస్తవం.. చర్యలు తప్పవు: మంత్రి అచ్చెన్న

2019 నుంచి 24 వరకు డీసీసీబీలో భారీ స్థాయిలో అవినీతి జరిగిన మాట వాస్తవమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. దీనికి కారణం డీసీసీబీలలో ఓ విధానం లెక్క లేదన్నారు. ఓ జీవో ఇచ్చి సెక్రటరీలు, డీసీసీబీలను అందరిని బదిలీ చేయాలని వెళ్లామన్నారు. హైకోర్టు దాన్నిస్టే చేశారని.. స్టే వెకేట్ చేయించి ముందుకు వెళతామన్నారు. 9 నెలల్లో వచ్చిన ఫిర్యాదులు అన్నింటిపై వెంటనే యాక్షన్‌కు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సభ్యులు చెప్పిన ప్రతీ విషయంపై ఒక ప్రొసీజర్ ప్రకారం ఆఫీసర్లతో ఓ ఎంక్వైరీ వేస్తున్నామని తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాలో జరిగిన అవినీతి ఎక్కడా జరగలేదని.. దాన్ని అంగీకరిస్తున్నామన్నారు. డీసీసీబీ బ్యాంకులకు సంబంధంలేని విషయాలను ఇంక్లూడ్ చేశారన్నారు. అధికారుల ఎంక్వైరీ రిపోర్టు వచ్చిందని... దాని ఆధారంగా మరో ఎంక్వైరీ వేశామన్నారు. ఆ రిపోర్టు రాగానే యాక్షన్ తీసుకుంటామని తెలిపారు. పాతవాళ్ళను 6,7 ని నాబార్డుకు చెప్పి తొలగించి కొత్తవారిని వేయించామన్నారు. ఓ టైం బౌండ్ ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కింది స్థాయిలో చర్యలు కాదని.. పై స్థాయిలో నుంచి కింది స్థాయి వరకూ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అవసరం అయితే ముఖ్యమంత్రి తో మాట్లాడి మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పీఏసీఎస్ లు, డీసీసీబీలను డిజిటలైజ్ చేయాలని నిర్ణయించామన్నారు. ఏప్రిల్‌తో ఈ బ్యాంకులను కూడా డిజిటలైజ్ పూర్తి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# జాబిల్లిపై త్వరలోనే అడుగుపెడతాం..

రోవర్‌ను మోసుకెళ్తుందని అన్నారు. మూడు రోజుల క్రితమే మాకు చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం నుంచి ఆమోదం లభించిందని.. జపాన్‌తో కలిసి ఈ ప్రయోగం నిర్వహిస్తామని నారాయణన్ వెల్లడించారు.

చంద్రయాన్-4 లాంచింగ్ అప్పుడే..

2027లో చంద్రయాన్-4 మిషన్ ద్వారా చంద్రుని నుంచి సేకరించిన నమూనాలను భూమికి తీసుకురావాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. ISRo భవిష్యత్తులో గగన్‌యాన్ సహా వివిధ ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. భారతదేశం స్వంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడమూ ఈ మిషన్లలో ప్రధానమైనది.

ఇస్రో చంద్రయాన్ ప్రయోగాలు..

చంద్రుని ఉపరితలాన్ని అధ్యయనం చేసేందుకు వరస చంద్రయాన్ ప్రయోగాలు చేపడుతోంది ఇస్రో.2008లో తొలిసారి విజయవంతంగా ప్రయోగించిన చంద్రయాన్-1 చంద్రుని రసాయన, ఖనిజ, ఫోటో-జియోలాజిక్ మ్యాపింగ్‌ను తీసుకుంది. చంద్రయాన్-2 మిషన్ (2019) 98 శాతం విజయవంతమైంది. చివరి దశల్లో కేవలం రెండు శాతం అనుకున్న విధంగా సక్సెస్ కాకపోవడమే కారణం. అయితే, ఇప్పటికీ చంద్రయాన్-2 లోని ఆన్‌బోర్డ్ హై రిజల్యూషన్ కెమెరా వందలాది చిత్రాలను పంపుతోందని ఇస్రో చీఫ్ నారాయణన్ స్వయంగా తెలిపారు. ఇక తర్వాత ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రయోగం ఇస్రో సాధించిన చారిత్రాత్మక విజయం. ఆగస్టు 23, 2023న చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండర్ విక్రమ్ విజయవంతంగా 'సాఫ్ట్-ల్యాండింగ్' చేసి చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతం చేసింది ఇస్రో. చంద్రుని ఉపరితలంపై సురక్షితమైన ల్యాండింగ్, ఎండ్-టు-ఎండ్ సామర్థ్యాన్ని ప్రదర్శించడమే ఈప్రయోగఉద్దేశం.

# అందులో ఒక శాతం నా భాగస్వామ్యం ఉన్నందుకు గర్విస్తున్నా

తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలతో దేశం అభివృద్ధి బాటలో ముందుకు పోతోందని... ఈ సంస్కరణల్లో ఒక శాతం నా భాగస్వామ్యం ఉన్నందుకు గర్విస్తున్నానని చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి ప్రపంచవ్యాప్తంగా భారతీయులు నెంబర్ వన్ గా నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి వందేళ్లు పూర్తవుతాయని పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం, టెక్నాలజీ, పీ4 వంటి అంశాలను విజన్ డాక్యుమెంట్ లో పొందుపరిచామని తెలిపారు. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మున్సిపాలిటీ, మండలాల వారీగా విజన్ ప్రణాళిక సిద్ధమైందని అన్నారు. సచివాలయం యూనిట్ గా తీసుకుని ప్రణాళిక అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రజల సామాజిక ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయో అంచనాలు రూపొందిస్తామని తెలిపారు. ప్రజలే ఆస్తిగా నియోజకవర్గాల ప్రోగ్రెసివ్ విజన్ రూపొందించామని చెప్పారు. ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. కుటుంబ జీవన ప్రమాణాలు పెరిగేలా ఆర్థిక స్వావలంబన దిశగా కృషి చేస్తున్నట్టు వివరించారు. చేపలు ఇవ్వడం కాదు... చేపలు పట్టేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యం, తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు ఉద్ఘాటించారు.

ప్రతి కుటుంబానికి నివాస స్థలం, ఇల్లు, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమని అన్నారు. సురక్షిత నీరు, గ్యాస్ కనెక్షన్ ఇలా అన్ని సౌకర్యాలు అందడమే లక్ష్యం అని వివరించారు. రానున్న రోజుల్లో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజి విద్యుదుత్పత్తి రంగాలు గేమ్ చేంజర్ లా మారతాయని స్పష్టం చేశారు. సంపద సృష్టికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పరిశ్రమలు తీసుకురావడమే బాధ్యతగా ఎమ్మెల్యేలు పనిచేయాలని చంద్రబాబు సూచించారు. గత ప్రభుత్వం తరహాలో పరిశ్రమలను తరిమేయొద్దని అన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ ట్రాక్ లో పెట్టగలిగామని, ఇలాంటి సమయంలో దూరదృష్టితో ఆలోచించి ప్రణాళికలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు.

# రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా ఇంటెల్ చీఫ్ తులసీ గబ్బర్డ్ భేటీ

పాల్గొన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబల్‌తోనూ ఆదివారం సాయంత్రం గబ్బర్డ్ సమావేశమయ్యారు. భారత్, అమెరికా మధ్య భద్రతారంగంలో బంధాన్ని బలోపేతం చేసుకోవడంతో ఉభయులూ చర్చించారు. ఇండో-పసిఫిక్, ఖలిస్థానీ ఉగ్రవాదం వంటి అంశాలు కూడా చర్చించినట్టు సమాచారం.

# లోక్‌సభలో రైల్వే సమస్యలపై కీలక చర్చ

పెండింగ్‌లో ఉన్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి రైల్వే లైన్‌ను ఆమోదించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ కేశినేని శివనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైల్వే బడ్జెట్ దేశా రైల్వే భవిష్యత్తుకు అనుకూలంగా మార్చాలనే ఎన్డీఏ ప్రభుత్వ నిబద్ధత ప్రతిబింబిస్తోందని అన్నారు. విజయవాడ సమీపంలోని పరిటాలలో మల్టీ-మోడల్ కమర్షి యల్ కార్గో టెర్మినల్ ఏర్పాటు చేయడాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ స్వాగతించారు. అమరావతి రాజధానిని ప్రధాన నగరాలు, ఓడరేవులతో అనుసంధానిచడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంపొందించడంలో అమరావతి రైల్వే లైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కోచ్ ఉత్పత్తి లక్ష్యం 2023-24 నుంచి 2024-25 వరకు 11శాతం పెరిగిందని, దేశీయ తయారీలో పురోగతిని పరిగణనలోకి తీసుకుంటూ కోచ్‌లను ఎగుమతి చేసే సామర్థ్యాన్ని ప్రభుత్వం అన్వేషించాలని ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. గత మూడేళ్లుగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద స్టేషన్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఎంపీ కేశినేని శివనాథ్ తీసుకెళ్లారు. విజయవాడ గుణదల-బెజవాడ క్రాసింగ్ వద్ద ఆర్ఓబీ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో జాయింట్ సర్వే పూర్తి కాగా, ఈ ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్ద ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న అంశాన్ని ఎంపీ శివనాథ్ ప్రస్తా వించారు. అజిత్‌సింగ్ నగర్‌లో ఆర్ఓబీ లేకపోవడంతో ప్రజలు పడుతు న్న ఇబ్బందులు వివరించి, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ జోక్యం చేసుకుని పరిష్కరించాలని ఎంపీ శివనాథ్ కోరారు. కేంద్రప్రభుత్వం రైల్వే వేగవంతమైన, మెరుగైన సమర్థత, స్థిరత్వాన్ని నిర్ధారించడంపై దృష్టి కేంద్రీకరించడం శుభ పరిణామమని అన్నారు. రైల్వే రూట్లలో 97శాతం విద్యుద్దీకరణలో సుస్థిరత పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధత స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఆధునికీకరణ కోసం 1,337 స్టేషన్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. 136 వందే భారత్ రైళ్ల ఏర్పాటుతో సుదూర ప్రాంతాలకు వేగవంతమైన అనుసంధానం గణనీయంగా మెరుగుపడిందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో రూ. 250 కోట్ల అవినీతి

ఏపీ ఉపాధి హామీ పథకంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి జరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అసెంబ్లీలో ఆరోపించారు. ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. మొత్తం రూ.250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు ఇచ్చిన నివేదికల ద్వారా వెల్లడైందని పవన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు 564 మండలాల్లో ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించిందని తెలిపారు. ఈ పరిశీలనలో అనేక అవకతవకలు బయటపడ్డాయని, ఉపాధి హామీ కింద ఖర్చు చేసిన నిధులపై అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పథకం ద్వారా వచ్చిన నిధులు లబ్ధిదారులకు చేరకుండా కొందరు మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లాయని డిప్యూటీ సీఎం ఆరోపించారు. ఇప్పటికే మొదలైన ఆడిట్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా మిగిలిన మండలాల్లో కూడా పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధి హామీపనులనుసమీక్షించి,అవినీతికికారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. భవిష్య త్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇక ఉపాధి హామీ కూలీలకు వేతనాల పెంపు అంశం అనేది కేంద్రం పరిధిలో ఉంటుందని పవన్ వెల్లడించారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు కచ్చితంగా చెల్లిస్తాం

ప్రశ్నలకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి సమాధానం ఇచ్చారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విషయంలో వైసీపీ అవాస్తవాలు ప్రచారం చేస్తుందంటూ మంత్రి లోకేశ్ కలగచేసుకుని వైసీపీ సభ్యుల ఆరోపణలు తిప్పికొట్టారు. మంత్రి మాట్లాడుతూ.. విద్యారంగంపై శాసనమండలిలో చర్చ జరిగితే వైసీపీ సభ్యులు ఎందుకు బయటకు వెళ్లారు? ఈ విషయాలన్నీ ఆ రోజు చెప్పాం. మీరెందుకు బాయ్ కాట్ చేశారు? ఆ రోజు జరిగిన చర్చలో ఫీజు రీయింబర్స్ మెంట్ పై చాలా స్పష్టంగా చెప్పాం. వినకుండా, చదవకుండా మళ్లీ ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నోట్ పంపిస్తాను, ఒకసారి చదవాలి. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వాస్తవాలు చెబుతుంటే దానిని కూడా ఓర్చుకోలేక పోతున్నారు. వైసీపీ హయాంలో రూ. 4,200 కోట్లు బకాయిలు పెట్టారు. అవునో, కాదో చెప్పాలి. వివరాలు పంపిస్తాం. స్కూల్ ఫీజు రీయింబర్స్ మెంట్, పీజీ ఫీజు రీయింబర్స్ మెంట్ వివరాలన్నీ అందులో ఉన్నాయి. 2019లో ఆనాటి ప్రభుత్వం పెట్టిన బకాయిలను 16 నెలల తర్వాత వైసీపీ ప్రభుత్వం చెల్లించింది. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలే అయింది. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు కచ్చితంగా చెల్లిస్తాం. హౌస్ సాక్షిగా హామీ ఇచ్చాను. చర్చలో వైసీపీ సభ్యులు లేకపోతే నేనేం చేయగలను. బీఏసీలో విద్యారంగంపై చర్చ కావాలని అడిగితే ఒప్పుకున్నాం. కానీ ఆ చర్చకు వైసీపీనే లేదు. వాస్తవాలు వినడానికి సిద్ధంగా లేరని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన వివరాలు పూర్తిగా చదవాలని సూచించారు. విద్యార్థుల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటమాడిందని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. వసతి దీవెన ఏనాడు సక్రమంగా చెల్లించలేదని ఆయన మండిపడ్డారు.

# ఇ వి ఎం గొడౌను తనిఖీ చేసిన కలెక్టర్ విజయ్ కృష్ణన్

అనకాపల్లి, ( పబ్లిక్ రూల్ ప్రతినిధి)



జిల్లా ఎస్.పి.కార్యాలయం ప్రాంగణంలో గల ఇ వి ఎం గొడౌను ను జిల్లా కలెక్టరు మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సోమవారం తనిఖీచేసారు. గొడౌను త్రైమాసిక తనిఖీలలో భాగంగా గొడౌను లో భద్రపరచిన ఇవిఎం మెషీన్లను, సి.సి. కెమెరాలు, అగ్నిమాపక పరికరాలను, భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టరు పరిశీలించారు. ఈ





కార్యకమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, అనకాపల్లి రెవిన్యూ డివిజినల్ అధికారి షేక్ ఆయిషా, ఎలక్షన్ సెక్టను సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి. శ్రీనివాసరావు, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి టి. షణ్ముఖ్, ఐఎన్ సి ప్రతినిధి మీసాల సుబ్బన్న, సి.పి.ఎం.ప్రతినిధి జి.శ్రీరామ్, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.




## విద్యార్థులు అందరూ పరీక్షలకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

అనకాపల్లి, ( పబ్లిక్ రూల్ ప్రతినిధి)



పదవతరగతి పరీక్షలకు విద్యార్థులు శతశాతం హాజరు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల తనిఖీలలో భాగంగా స్థానిక ఎన్.టి.ఆర్. ఆసుపత్రి వద్ద గల భాష్యం పాఠశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టరు తనిఖీచేసారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆరోగ్యశిబిరం, భద్రత, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాల గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు అందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, అందుకు సంబంధించి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాద్యాయులకు తగు సూచనలు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడును జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజినల్ అదికారి షేక్ ఆయిషా పాల్గొన్నారు.

## పి.జి.ఆర్.ఎస్ సదస్సులను వినియోగించుకోవాలి-ప్రజల సమస్యలకు గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలి- జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

అనకాపల్లి, ( పబ్లిక్ రూల్ ప్రతినిధి)



ప్రజల సమస్యలను గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కరించాలని జిల్లా కలెక్టరు జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో జిల్లా విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కె.ఆర్.సి.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టరు శాఖలవారీగా పి.జి.ఆర్.ఎస్. పెండింగు అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్బంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రజలు గ్రామ, మండల స్థాయిలో ఏర్పాటుచేసిన పి.జి.ఆర్.ఎస్ వినియోగించుకోనేలా అవగాహన, ప్రచారం కల్పించాలని తెలిపారు. పెండింగు అర్జీలను వెంటనే పరిష్కరించాలని, ఈ రోజు వచ్చిన అర్జీలు వచ్చే వారం నాటికి పెండింగు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ప్రజల సమస్యలకు గ్రామ, మండల స్థాయిలోనే పరిష్కారంచూపాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించడం వలన ప్రజలకు సమయం, డబ్బు ఆదాఅవుతుందన్నారు. ప్రతి సమస్యకు జిల్లా కార్యాలయం నకు వచ్చుటకు ప్రజలు యిబ్బందులు పడతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పి.జి.ఆర్.ఎస్. లో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత యివ్వాలని తెలిపారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలని, అది అర్జీదారు సంతృప్తిపడే విధంగా ఉండాలన్నారు. అదికారులు అర్జీకి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలని, అర్జీదారునితో స్వయంగా మాట్లాడాలన్నారు. పరిష్కరించ గలగిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కాని అర్జీలగూర్చి అందుకు గల కారణాలు ధరఖాస్తుదారునికి తెలియజేయాలన్నారు. అర్జీలకు పరిష్కారం చూపడమేకాకుండా, పరిష్కారం కాని ధరఖాస్తులకు వివరంగా సమాధానం తెలియజేయుట ద్వారా ఐ వి ఆర్ ఎస్ లో ప్రజాభిప్రాయం సంతృప్తికరంగా వచ్చే విధంగా పనిచేయాలని తెలిపారు

## తిరుమల శ్రీనివాసుని దర్శించిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం ( పబ్లిక్ రూల్ ప్రతినిధి)



తిరుమల శ్రీనివాసుని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన సతీమణి పద్మావతి మరియు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్న అనంతరం, తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తుల మధ్య అన్నప్రసాద స్వీకరించారు. ఈ సందర్భంగా గౌరవ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, తిరుమల శ్రీ వేంకటేశ్వరుని కృపా కటాక్షాలు సర్వ జనులకు లభించాలని ఆకాంక్షించారు. దేవస్థానం వృద్ధి, భక్తుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన దంపతులను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు రంగనాయక మండపములో వేద పండితులు వేదాశీర్వచనము చేశారు.

# పార్టీని ముందుండి నడిపించిన జన పైనికుడు సూర్యచంద్ర

## కష్టపడి పార్టీని నడిపించిన సూర్యచంద్రపై కుట్రలా..?

## కుట్ర రాజకీయాలకు స్వస్తి పలకాలంటున్న జన సైనికులు

నర్సీపట్నం( పబ్లిక్ రూల్ ప్రతినిధి)











జనసేన పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్,బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర. పార్టీకి నర్సీపట్నం నియోజకవర్గంలో మంచి ఊపు తెప్పించారు.పార్టీని క్షేత్ర స్థాయిలో నడిపించడంలో సూర్యచంద్ర కృషి ఎనలేనిది. సభ్యత్వ నమోదు కార్యక్రమాలతో పాటు నియోజకవర్గంలో ప్రతీ సమస్యపై సూర్యచంద్ర తన గళాన్ని వినిపించారు.వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎన్నో ఉద్యమాలు చేసిన ఘనత ఆయనకే దక్కింది.రోడ్ల సమస్యలపై ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అమరణ నిరాహారదీక్ష చేపట్టారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ అన్ని కార్యక్రమాలను ఇప్పటి వరకు విజయవంతం చేస్తూనే ఉన్నారు.అప్పటి అధికార వైసీపీ నాయకులు సూర్యచంద్రపై కేసులు పెట్టిన సందర్భాలు లేకపోలేదు.అయినా అవేవి లెక్క చేయకుండా వైసీపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తుతూనే వచ్చారు.కరోనా రాష్ట్ర సమయంలో ఎంతో మందిని అదుకున్నారు.జనసేనాని పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ కార్యక్రమాలను నియోజకవర్గ స్థాయిలో ఒంటిచేత్తో నడిపిన జనసైనికుడు సూర్యచంద్ర అని చెప్పక తప్పదు.ఇదిలా ఉండగా ప్రస్తుతం సూర్యచంద్రపై అదే పార్టీకి చెందిన వారు వైసీపీతో జతకట్టి బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయాలన్నింటికి పార్టీ అధిష్టానం నిశితంగా పరిశీలిస్తుందని జనసేన పార్టీకి చెందిన కొందరు నాయకులు అంటున్నారు.ఏదిఏమైనప్పటికీ సూర్యచంద్ర పార్టీ బలోపేతంకు చేసిన కృషి,పోరాటాలను పట్టుదలతో నడిపిన తీరుతో ఆయన ప్రజలకు ఎంతో చేరువయ్యారు.ఇది జీర్ణించుకోలేకే పార్టీలో కొంత మంది కుట్ర రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని అంటున్నారు. ఏదిఏమైనప్పటికీ సూర్యచంద్ర చేసిన మంచి పనులు,ఆయన వల్ల పార్టీకి కలిగిన లాభాలను జనసైనికులు ఎప్పటికీ మరువరు.పార్టీని ఒంటిచేత్తో నడిపిన సూర్యచంద్ర పనితీరు ప్రశంసనీయమని,అలాంటి ఆయనపై నిందలు వేయడం సరికాదనేది ప్రజల అభిప్రాయం. నియోజకవర్గంలో జనసేన పార్టీలో ఎంతో మేధో శక్తివంతమైన నాయకుడిగా సూర్యచంద్ర మంచి గుర్తింపు పొందారు.

# అనకాపల్లి పట్టణంలో క్వారీ లారీ రైల్వే ట్రాక్‌ను ఢీకొన్నఘటన -కఠిన చర్యలు

## అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ




అనకాపల్లి పట్టణం( **పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

ఈరోజు తెల్లవారుజామున అనకాపల్లి పట్నంలోని విజయరామరాజు పేట అండర్ బ్రిడ్జి వద్ద మార్టూరు నుండి అనకాపల్లి పట్నం వైపుగా రాళ్లతో వస్తున్న క్వారీ లారీ నిర్లక్ష్యంగా వెళ్ళి రైల్వే ట్రాక్‌ను ఢీకొనడంతో ట్రాక్ దెబ్బతిన్న ఘటనపై జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, ఐపిఎస్ గారు తీవ్రంగా స్పందించారు. వారి ఆదేశాల మేరకు అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ సంబంధిత లారీని అదుపులోకి తీసుకుని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ద్వారా ?1,01,730/- జరిమానా విధించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే అధిక లోడుతో ప్రయాణించే లారీ యజమానులను పిలిపించి, ప్రమాదాలకు కారణమైన, నిర్లక్ష్యంగా లారీలు నడిపిన డ్రైవర్లకు హెచ్చరించడం జరిగిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్వారీ లారీలు, గూడ్స్ లారీలు పై ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, లారీ డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా, లారీ యజమానులు మరియు డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి రవాణా నిబంధనలు, రహదారి భద్రతా నియమాలు గురించి అవగాహన కల్పించనున్నారు. అనకాపల్లి జిల్లా పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, రవాణా నిబంధనలు పాటించాలని సూచిస్తోంది. నిబంధనలను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

# ఫ్లాంట్ (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ - అసెస్మెంట్ టెస్ట్) పరీక్షను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి, ( **పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

ఫ్లాంట్ (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ - అసెస్మెంట్ టెస్ట్) పరీక్షను జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. ఫ్లాంట్ పరీక్షను మార్చి 23వ తేదిన నిర్వహించుటకుగాను సంబంధితశాఖల అధికారులతో సోమవారం కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ వయోజన విద్యశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమంలో బాగంగా, జిల్లాలో మహిళా స్వయంశక్తి సంఘాలలోగల నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులను చేయుటకుగాను మొదటి దశలో బాగంగా 11900 మంది అబ్యాసకులను నమోదు చేసి, 1190 మంది అక్షరాస్యులతో అక్షరాస్యతా కేంద్రాలను ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసి వాలంటరీ టీచర్ల ద్వారా ఉల్లాస్ %-%అక్షరాస్యతా కేంద్రాలు నిర్వహించి చదువు నేర్పడం జరిగిందని, చదంవు నేర్చుకుంన్న అభ్యాసకులకు ఈ నెల 23వ తేదీన గ్రామంలో గల అంగన్ వాడి కేంద్రం లేదా పాఠశాలయందు ఫ్లాంట్ పరీక్ష నిర్వహించాలని తెలిపారు. అంగన్వాడి టీచరు లేదా సెకండరీ గ్రేడు టీచరు పరీక్షా నిర్వహకులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. వయోజన విద్యాశాఖనుండి పరీక్షపేపర్లు, సంబంధిత సామగ్రి అందజేయబడుతుందని, కావున జిల్లా మండల స్థాయిలో సంబంధిత శాఖలు సమన్వయం చేసుకొని ఫ్లాంటు పరీక్షను నిర్వహించి, సంబంధిత నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉపసంచాలకులు ఎస్.ఎస్. వర్మ, నోడల్ అధికారి డి. చిన్నికృష్ణ, డి.ఆర్.డి.ఎ. ప్రోజెక్టు డైరెక్టరు కె.శచీదేవి, ఐ.సి.డి.ఎస్. పి.డి. కె.అనంతలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా జరిగిన పదవ తరగతి పరీక్షలు




మాడుగుల ( **పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

మాడుగుల కేంద్రంతో పాటు మండలంలో ఐదు సెంటర్లలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటిరోజు తెలుగు పరీక్షకు మాడుగుల బాయ్స్ హై స్కూల్ కు 105 మంది రెగ్యులర్ విద్యార్థులు ముగ్గురు ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా రెగ్యులర్ విద్యార్థులు 104 మంది హాజరై ఒకరు గైన్ హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు ముగ్గురు గైన్ హాజరయ్యారు. అదేవిధంగా జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థులు 138 మందికి 138 మంది హాజరయ్యారు. అదేవిధంగా కేజీపురంలో 159 మందికి 159 మంది పరీక్షకు హాజరు కాగా ప్రైవేట్ విద్యార్థులు ఇద్దరు హాజరు కావాల్సిందిగా ఒకరు హాజరై ఒకరు గైన హాజరయ్యారు. తాటిపర్తి సెంటర్లో 151 మందికి గాను 149 మంది విద్యార్థులు హాజరు కాగా ఇద్దరు గైన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ దేవుడమ్మ మాట్లాడుతూ మండలంలో గల ఐదు పరీక్ష కేంద్రాల్లో 706 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ముగ్గురు గైన్ హాజరు కాగా 703 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. అలాగే ప్రైవేట్ విద్యార్థులు 5 గురికి గాను ఒకరు హాజరు కాగా నలుగురు గైన్ హాజరయ్యారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

# మైనింగ్ మాఫియా చర్యలను అరికట్టాలి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్



అనకాపల్లి( **పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

క్వారీ లారీల ఓవర్ లోడ్ తో పాటు అదుపు లేని అతివేగం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి మృతి చెందుతున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. అనకాపల్లి జిల్లా మునగపాక వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ క్వారీ లారీల ప్రమాదాలపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ క్వారీ లారీల ప్రమాదాలతో ఎలమంచిలి నియోజకవర్గంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని,ఈ ప్రమాదాల్లో చాలామంది మృతి చెందడం తో పాటు,తీవ్ర గాయాలతో ఇంకా చాలా మంది హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు.ఈ క్వారీ ప్రమాదాలపై జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ లు స్పందించాలని బొడ్డెడ్డ ప్రసాద్ డిమాండ్ చేశారు.అనకాపల్లి అండర్ బ్రిడ్జి వద్ద క్వారీ లారీ ఢీకొనడంతో రైల్వే ట్రాక్ పక్కకు జరిగిందని అన్నారు.ప్రమాదవశాత్తు ఏటువంటి రైళ్లు రాకపోవడం తో భారీ ప్రమాదం తప్పిందని అన్నారు.క్వారీ మాఫియా పై తక్షణమే చర్యలు తీసుకోకపోతే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బొడ్డేడ ప్రసాద్ హెచ్చరించారు. నిన్న మునగపాక గ్రామంలో జరిగిన క్వారీ లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనలో పోలీసులు వ్యవహార శైలిపై హాలో అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ అక్రమ మైనింగ్ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం పెద్దల పాత్ర ఉందని ఈ అక్రమ మైనింగ్ పై జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ స్పందించి చర్యలు తీసుకోవాలని బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు అనంతరం అచ్యుతాపురం మునగపాక మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి బొడ్డేడ ప్రసాద్ మునగపాక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అక్రమ క్వారీ మాఫియా పై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ ఆదిమహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. నిన్న జరిగిన ప్రమాదంపై మృతుని బంధువు మునగపాక తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మృతుని బంధువు మాట్లాడుతూ నిన్న జరిగిన ప్రమాదంలో మా బాబాయి మృతి మా కుటుంబాన్ని చిన్నభిన్నం చేసిందని మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసింది. క్వారీ మాఫియా వలన మరో కుటుంబానికి ఇటువంటి కష్టం రాకుండా చూడాలని ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో మునగపాక మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, సర్పంచులు దిమ్మల అప్పారావు, దాసరి అప్పారావు, గంగప్పల నాయుడు, బో శ్రీనివాసరావు, సరగడం వెంకట జగన్నాథరావు,మోల్లేటి నారాయణరావు, లంబా అప్పారావు, ఆడారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

# వడ్డాది వెంకన్న హుండీ ఆదాయం రూ.12,75,666లు

## గత ఏడాది కంటే రూ.2.67 లక్షలు అధికం





బుచ్చయ్య పేట ( **పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

బుచ్చయ్యపేట,మండలం వడ్డాది వెంకన్న152వ కల్యాణోత్సవాలు ఈ నెల 10 నుండి 15వ తేదీ వరకు జరిగాయి ఈ కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా వడ్డాది వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కించారు.గత ఏడాది కంటే ఈ ఏడాది స్వామివారికి రూ.2.67,640లు ఆదాయం అధికంగా వచ్చింది.హుండీలలో రూ.7,86,406లు,టికెట్లు అమ్మకం ద్వారా రూ.4,08665లు, తలనీలాలు రూ.25వేలు, కొబ్బరి చిప్పలు వేలం ద్వారా రూ.38వేలు,ఆశీలు రూ.9160లు, విరాళాలు రూ.8435లు, మొత్తం రూ.12,75,666లు వచ్చినట్లు ధర్మకర్త దొండా కన్నబాబు,ఈఓ టివిఎస్ శర్మ తెలిపారు.గత ఏడాది రూ.10,08,026లు వచ్చిందని తెలిపారు.ఎస్సై ఏ శ్రీనివాసరావు,గ్రామ పెద్దలు దొండా సన్యాసిరావు,వీర్ల సురేష్, దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు



బుచ్చయ్యపేట ( **పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

కలిసి చదువుకున్నప్పుడే కాదు కష్టాల్లో ఉన్న మిత్రులకి కూడా మేము తోడుగా ఉంటాం అని పూర్వపు విద్యార్థులు రుజువు చేశారు బుచ్చయ్య పేట మండలం పద్దాది కేఏడి జడ్పీహెచ్ఎస్ స్కూల్లో 2008 2009 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఉదారత చాటారు . బంగారు మెట్ట గ్రామానికి చెందిన మీసాల శివ గత వారంలో రైలు ప్రమాదంలో మరణించాడు శివ కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించేవాడు .కుటుంబానికి చేదుడు వాదడిగా ఉన్న శివ మరణించడంతో కుటుంబం అంతా దిక్కుతోచనే స్థితిలో ఉన్నారు శివ మరణ వార్త విన్న తోటి మిత్రులు 36,000 విరాళంగా తన భార్య కి అందించారు. శివ కి గత ఏడాదే వివాహం అయింది శివ భార్య తల్లి మీసాల రవణమ్మ కన్నీరు మున్నీరై వినిపిస్తున్నారు శివ కుటుంబాన్ని ఆదుకున్న తోటి మిత్రులను స్థానికులు కుటుంబ సభ్యులు అభినందించారు.

# రాజుపాలెం లో అగ్నిప్రమాదం

బుచ్చియ్య పేట ( **పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

బుచ్చియ్య పేట మండలం పెదపూడి శివారు





రాజుపాలెం గ్రామంలో నమ్మి చిలుకలు పకలు వద్ద అగ్ని ప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో నమ్మి చిలుకులకు చెందిన 15 మేకలు మూడు పశువులు పాకలు, పూర్తిగా ఖాళీ బూడిదైపోయాయి. కొన్ని మేకలకు వైద్య సేవలు అందించారు. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిలిందని బాధిత కుటుంబాలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రభుత్వం నుండి నాకు న్యాయం చేయాలని చిలకలు కోరుతున్నారు .ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి బగాధి రాము ,స్థానిక నాయకులు సునీల్, విఆర్ఓ రామారావు, గ్రామ సర్పంచ్ వరకిష్ణ ,మండల పార్టీ ప్రెసిడెంట్ జి కోటేశ్వరరావు, నెమాల సత్యనారాయణ, నమ్మి సత్యనారాయణ పలువురు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

# నూతన ఆలయ విగ్రహాప్రతిష్ఠ



మాడుగుల ( **పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

మండలం కేంద్రమైన మాడుగులలో సోమవారం విజయదుర్గా భవాని, వల్లిదేవ సేన సమేత సుబ్రహ్మణ్య స్వామి నూతన ఆలయ విగ్రహాప్రతిష్ఠ మహెూత్సవమును ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేధమంత్రాలతో హెూమ కార్యక్రమాలతో పూజా కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గత మూడు రోజుల నుంచి ఘనంగా చేయడం జరిగిందని నిర్వాహకులు దుక్క రమణరెడ్డి సత్యవతి దంపతులు తెలిపారు.

# మాడుగుల సంతకు భారీగా తరలివచ్చిన గిరి ఫలాలు...



మాడుగుల **( పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

మాడుగుల కేంద్రంలో సోమవారం జరిగే వారపు సంతకు గిరిజన ప్రాంతాలైన సలగు, కక్కి, కందుల పాలెం, ఈదుల పాలెం, దేవాపురం పులుసుమామిడి తదితర గ్రామాల గిరిజనులు చింతపండును అధిక సంఖ్యలో తీసుకొని వచ్చారు. గత ఏడాది కంటే ఈ ఏడాది చింతపండు దిగుబడి అధికంగా ఉండడంతో ఈవారం అధికంగా చింతపండు వచ్చింది. అయినప్పటికీ సుమారు 35 కిలోల కావిడ చింతపండు ధర 2 వేలకు పైగానే పలికింది.దీంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల నుండి కొనుగోలు చేసేందుకు భారీ ఎత్తున వ్యాపారులు వచ్చారు. ఇదిలా ఉండగా వ్యాపారులకు దళారీల బెడద తప్పడం లేదు. సంత ప్రారంభంలో రైతులు 2 వేలకు పైగా కావిడి విక్రయాలు చేయగా అనంతరం రైతులు చేతుల్లో నుండి దళారీలు లాక్కొని మరి 2500 నుండి 3 వేలకు రూపాయల వరకు విక్రయాలు చేశారు. ఇప్పటికైనా దళారీ వ్యవస్థను లేకుండా నిర్మూలించాలని సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.

# మైనింగ్ మాఫియా చర్యలను అరికట్టాలి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్



అనకాపల్లి**( పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

క్వారీ లారీల ఓవర్ లోడ్ తో పాటు అదుపు లేని అతివేగం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి మృతి చెందుతున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. అనకాపల్లి జిల్లా మునగపాక వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ క్వారీ లారీల ప్రమాదాలపై మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ క్వారీ లారీ ల ప్రమాదాలతో ఎలమంచిలి నియోజకవర్గంలో ఎక్కువగా





ప్రమాదాలు జరుగుతున్నాయని,ఈ ప్రమాదాల్లో చాలామంది మృతి చెందడం తో పాటు,తీవ్ర గాయాలతో ఇంకా చాలా మంది హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు.ఈ క్వారీ ప్రమాదాలపై జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ లు స్పందించాలని బొడ్డెడ్డ ప్రసాద్ డిమాండ్ చేశారు.అనకాపల్లి అండర్ బ్రిడ్జి వద్ద క్వారీ లారీ ఢీకొనడంతో రైల్వే ట్రాక్ పక్కకు జరిగిందని అన్నారు.ప్రమాదవశాత్తు ఏటువంటి రైళ్లు రాకపోవడం తో భారీ ప్రమాదం తప్పిందని అన్నారు.క్వారీ మాఫీయా పై తక్షణమే చర్యలు తీసుకోకపోతే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బొడ్డేడ ప్రసాద్ హెచ్చరించారు. నిన్న మునగపాక గ్రామంలో జరిగిన క్వారీ లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనలో పోలీసులు వ్యవహార శైలిపై హలో అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ అక్రమ మైనింగ్ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం పెద్దల పాత్ర ఉందని ఈ అక్రమ మైనింగ్ పై జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ స్పందించి చర్యలు తీసుకోవాలని బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు అనంతరం అచ్యుతాపురం మునగపాక మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి బొడ్డేడ ప్రసాద్ మునగపాక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అక్రమ క్వారీ మాఫియా పై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ ఆదిమహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. నిన్న జరిగిన ప్రమాదంపై మృతుని బంధువు మునగపాక తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మృతుని బంధువు మాట్లాడుతూ నిన్న జరిగిన ప్రమాదంలో మా బాబాయి మృతి మా కుటుంబాన్ని చిన్నభిన్నం చేసిందని మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసింది. క్వారీ మాఫియా వలన మరో కుటుంబానికి ఇటువంటి కష్టం రాకుండా చూడాలని ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో మునగపాక మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, సర్పంచులు దిమ్మల అప్పారావు, దాసరి అప్పారావు, గంగప్పల నాయుడు, బో శ్రీనివాసరావు, సరగడం వెంకట జగన్నాథరావు,మోల్లేటి నారాయణరావు, లంబా అప్పారావు, ఆడారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

# వడ్డాదిలో ఘనంగా పూర్వ విద్యార్థుల కలయిక





బుచ్చయ్యపేట**( పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

వారంతా పదవ తరగతి కలిసి చదువుకున్నారు. 24 ఏళ్ల తర్వాత అందరూ ఒక్కసారి కలుసుకున్నారు. అది ఎక్కడో కాదు బుచ్చయ్యపేట మండలం వడ్డాది హైస్కూల్లో. 24 సంవత్సరాల క్రితం 10వ తరగతి చదువుకున్న అప్పటి విద్యార్థులు 24 ఏళ్ల తర్వాత ఇప్పుడు అందరూ ఒకసారి కలుసుకొని ఒకరినొకరు పలకరించుకున్నారు. ఏరా శంకర్ ఎలా ఉన్నావ్ అంటూ ఒకరు పలకరిస్తే, మస్తుగున్న మామ అంటూ శ్రీను సమాధానం చెప్పారు ఇలా ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆనందంగా గడిపారు. ఇదంతా వడ్డాది జిల్లా పరిషత్ హైస్కూల్లో 1999-2000 బ్యాచ్ 24 ఇయర్స్ సందర్భంగా కోవెల అప్పన్న దొర హైస్కూల్లో జరిగిన సందడిగా జరిగింది. పాటలకు డాన్స్ చేస్తూ ఎంతో ఉల్లాసంగా గడిపారు. మొత్తం మీద వడ్డాది హైస్కూల్లో సందడి వాతావరణాన్ని సృష్టించారని చెప్పొచ్చు.

ఈ కార్యక్రమంలో అప్పటి విద్యార్థులు సుమారు 150 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచాల సత్తిబాబు తండ్రి నానారాజు జ్ఞాపకార్థం హైస్కూల్లో చదువుకొని టెన్త్ క్లాసులో టాపర్ వచ్చిన విద్యార్థికి ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫీజు కడతారని ప్రామిస్ చేసారు. ఈ కార్యక్రమంలో మంచాల సత్తిబాబు, ఎర్రంశెట్టి శ్రీను, తలారి శంకర్, కర్రీ గణేష్ (ముకుందపురంపురం సర్పంచ్), చంటిగాడు యూత్, సాలాపు ముత్యాల నాయుడు, వేగి జగదీష్, వెంకట్రావు రామాన్నదొర తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో కుంగిన రైల్వే వంతెన ..

**<u>అనకాపల్లి జిల్లా విజయరామరాజుపేటలో కుంగిన రైల్వే వంతెన</u>**

**<u>అండర్ బ్రిడ్జి వద్ద గడ్డర్ ను ఢీకొట్టిన భారీ వాహనం</u>**

**<u>మరో ట్రాక్ పైనుంచి రైళ్ల రాకపోకలను పునరుద్దరించిన అధికారులు</u>**

అనకాపల్లి ( పబ్లిక్ రూల్ ప్రతినిధి)



రైల్వే వంతెన కుంగిపోవడంతో విశాఖ %-% విజయవాడ మార్గంలో ఆదివారం రాత్రి పలు రైళ్ల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. అనకాపల్లి జిల్లా విజయరామరాజు పేటలో రైల్వే వంతెన కుంగింది. ఆదివారం రాత్రి భారీ వాహనం ఒకటి వంతెన కింద నుంచి వెళుతూ గడ్డర్‌ను ఢీకొట్టింది. దీంతో అండర్ బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతింది. దీంతో కశింకోట వద్ద గోదావరి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేశారు. ఎలమంచిలిలో మహబూబ్ నగర్ ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేశారు. కొంత సమయం తర్వాత మరో ట్రాక్ పైనుంచి రాకపోకలను పునరుద్ధరించారు. దెబ్బతిన్న రైల్వేట్రాక్‌కు సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు.

# పరామర్శ



ప్రత్తిపాడు**( పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

పితృ వియోగంతో బాధపడుతున్న మహాసేన రాజేష్ ను కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించారు.

# ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు..

ఆలమూరు:- **( పబ్లిక్ రూల్ ప్రతినిధి)**

2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. ఆలమూరు మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ 1 బి అప్పాజీ తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన మొత్తం 684 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 682 మంది హాజరయ్యారన్నారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు. తొలి పరిక్ష కావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అమలు చేశారు.పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు స్మార్ట్ ఫోన్, స్మార్ట్ వాచీలు, ఇతర ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు లోపలకు తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. అలాగే వేసవికాలం దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రాలకు తరలించి, పరీక్ష పూర్తయిన అనంతరం జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేసేంతవరకు పోలీస్ సిబ్బంది ఎస్కార్ట్ సౌకర్యం కల్పించారు.